క్లుప్తంగా

నేడు అవగాహన సదస్సు

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలోని రాజీవ్ యువ వికాసం పథకంపై అవగాహన సదస్సు, దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ జయరాం తెలిపారు. దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ రూ.30 వేలతో చెర్వుగట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు ధరణి, ఉమామహేశ్వరి, దాసోజు కోటి, గబ్బర్‌సింగ్, సతీష్, శంకర్, మర్రి నర్సింహ, చీర రమేష్, తదితరులు ఉన్నారు.

సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సీఐ ఆదిరెడ్డి

చండూరు : గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు చండూరు సీఐ ఆదిరెడ్డి, ఎస్ఐ వెంకన్న, గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, రాధిక, యాదగిరి, విజయ్, గోపి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సర్వే

నకిరేకల్ : మండలంలోని ఓగోడు గ్రామంలో నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా నాలుగో రోజు గురువారం గ్రామ సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య మాట్లాడుతూ ఈ సర్వే వల్ల ఆరోగ్యం, విద్య, ఆర్థిక, వ్యవసాయ, ఉపాధి, వనరులతోపాటు ప్రజల జీవన ప్రమాణాలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రోగాం అధికారిణి హరిత, అధ్యాపకులు నాగు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసాచారి, శంకర్, సతీష్, శివ శంకర్, నర్సింహాచారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య రాకుండా చూడండి



సమస్యలు తెలుసుకుంటున్న డీపీఓ వెంకయ్య

కట్టంగూర్ : గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకయ్య అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని పామనగుండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి గ్రామంలో పర్యటించి మంచినీటి సరఫరా, శానిటేషన్ పరిశీలించారు. ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీఓ చింతమల్ల చలపతి, జీపీ కార్యదర్శి జయసుధ ఉన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

చండూరు : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని బీజేపీ చండూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పందుల సత్యం అన్నారు. చండూరులోని 1,7 వ వార్డుల్లో బీజేపీ నాయకులతో కలిసి గురువారం ఆరు గ్యారంటీల దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, బూతరాజు శ్రీహరి, బోడ ఆంజనేయులు, చనగాని శేఖర్, రవీందర్, నాగరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ప్రధాని ఫొటో పెట్టాలి

మర్రిగూడ : ప్రతి రేషన్ షాపులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గురువారం తహసీల్దార్ బక్క శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలకు ఉచిత బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం కిలోకు రూ.40 చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.10 మాత్రమే చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో యాస అమరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజుగౌడ్, శ్రీనివాస్‌రావు, యాదగిరి, లింగం పాల్గొన్నారు.

ముమ్మరంగా నీటి ట్యాంకుల నిర్మాణం

- నకిరేకల్‌కు అమృత్ పథకంలో రూ.25 కోట్లు మంజూరు
- పనులు పూర్తయితే ప్రజలకు తీరనున్న తాగునీటి కష్టాలు



నకిరేకల్ మార్కెట్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

నకిరేకల్ : ప్రతి ఇంటికి శుద్ధ జలాలు అందించేందుకు నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం ద్వారా చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ ట్యాంకుల నిర్మాణం పూర్తయితే పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పుతాయి. నకిరేకల్ పట్టణంలో 40 వేలకుపైె చిలుకు జనాభా ఉన్నారు. మున్సిపాలిటీలో మొత్తంలో 9,150 నివాస గృహాలు ఉన్నాయి. ప్రస్తుతం పట్టణంలో 16 ఓవర్ హెడ్ ట్యాంకులు, 56 మినీ ట్యాంకులు, 310 పబ్లిక్ నల్లాలు ఉన్నాయి. ఇక గృహాలకు 8560 నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం పట్టణం మొత్తానికి 5 లక్షల లీటర్ల తాగునీరు అవసరం ఉండగా 2.50 లక్షల లీటర్ల నీరు మాత్రమే అందిస్తున్నారు.

పూర్తి స్థాయిలో అందని తాగునీరు..

నకిరేకల్ పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథ పనులు చేపట్టినప్పటికీ 20 శాతం మేర పట్టణంలోని గృహాలకు మాత్రమే తాగునీరు అందుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని బాబసాహెబ్‌గూడెంతోపాటు పట్టణంలోని కొన్ని కాలనీల్లో ఇళ్లకు నల్లా కనెక్షన్ ఇచ్చి వదిలేశారు. ఇంకా 80 శాతం మందికి పైగా ప్రజలు తాగు నీటికోసం పబ్లిక్ నల్లాలే దిక్కయ్యాయి. 20 వార్డుల్లోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ నల్లాలకు వారానికి మూడుసార్లకు మించి నీటిని వదలడం లేదు. దీంతో ప్రజలు క్యాన్లలో, బిందెల్లో నీటిని పట్టుకుని నిల్వ చేసుకుని వినియోగించుకుంటున్నారు. మరి కొంతమంది ప్రైవేటుగా వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు.

మూడు భారీ ట్యాంకులు..

మున్సిపాలిటీల్లో తాగు నీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం ప్రవేశపెట్టింది. 2022లో నకిరేకల్ మున్సిపాలిటీకి అమృత్ పథకం కింద రూ.25 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ల ప్రకియ ఆలస్యం కావడంతో పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగింది. అమృత్–2.0 పథకం కింద నకిరేకల్ పట్టణంలో రూ.25 కోట్ల వ్యయంతో మూడు భారీ ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. గత ఏడాది ప్రారంభంలోనే ఈ పనులను ప్రారంభించారు. ఈ మూడు ట్యాంకుల్లో 24.50 లక్షల లీటర్ల నీరు నిల్వ ఉండేలా ప్రణాళిక రూపొందించారు. పనులను 2026 మార్చి వరకు పూర్తి చేయాలని గడువు విధించారు. పానగల్ మంచినీటి సంప్ నుంచి ప్రత్యేక గొట్టపు మార్గం ద్వారా ఈ మూడు ట్యాంకులకు లైన్ వేయనున్నారు. ఆ తరువాత ట్యాంకుల ద్వారా నకిరేకల్ పట్టణంలోని అన్ని కాలనీల్లో నీరు సరఫరా చేసేందుకు దాదాపు 36 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్, నిమ్మ మార్కెట్, నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్ వీధిలో మొత్తం మూడు భారీ ట్యాంకులు నిర్మాణంలో ఉన్నాయి. ఒక్కో ట్యాంక్ 7 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు.

ప్రతి ఇంటికి తాగు నీరు అందిస్తాం



అమృత్ పథకం కింద చేపట్టిన ట్యాంకుల నిర్మాణం పూర్తయితే మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి మంచినీరు అందుతుంది. నకిరేకల్ మున్సిపాలిటీలో పనుల వేగంగా జరుగుతున్నాయి. ఈ ట్యాంకులు పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తే ఇక పట్టణంలో తాగు నీటి సమస్యలు తొలగిపోతాయి.
– చౌగోని రజిత, మున్సిపల్ చైర్‌పర్సన్, నకిరేకల్

ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాలి



మా కాలనీలో ఏర్పాటు చేసిన పబ్లిక్ నల్లాకు వారానికి రెండుసార్లు మించి నీటిని వదలడం లేదు. నల్లా నీరు వచ్చినప్పుడు క్యాన్లు, బిందెల్లో నిల్వ చేసుకుంటున్నాం. మున్సిపాలిటీవారు ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాలి.
– కనుకుంట్ల ఆగమ్మ, సుందరయ్యనగర్

సన్న బియ్యం.. పేద కుటుంబాలకు వరం



చిట్యాల: గుండ్రాంపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి



నకిరేకల్ : సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత

కనగల్ : పేదలకు సన్న బియ్యం పంపిణీ చేయడం వరంలాంటిదని డీఆర్డీఓ ఎర్రబెల్లి శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్ కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి మాజీ కో ఆప్షన్ సభ్యుడు హఫీజ్, నర్సింగ్ మురళీధర్‌గౌడ్, కరీముల్లా డీలర్ నర్సింగ్ సుధాకర్, నర్సింగ్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ: పట్టణంలోని బోయవాడ, విద్యానగర్‌కాలనీ, సతీష్‌నగర్ కాలనీల్లో గురువారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునాస ప్రసన్న, మోర ప్రదీప్ కుమార్, వడ్డె బోయిన రాజు, నర్సింగ్ నవీన్, అంబటి జానకి రామ్ పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ

నకిరేకల్ : పట్టణంలోని పలు వార్డుల్లో రేషన్ షాపుల వద్ద గురువారం సన్న బియ్యం పంపిణీని మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమురుద్దీన్, ఆర్ఐ చిరంజీవి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న, కొండ వెంకన్న, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి కృషి

చిట్యాల: పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అదేవిధంగా వట్టిమర్తి, ఉరుమడ్ల గ్రామాల్లో ఏఎంసీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, వెలిమినేడు, ఆరెగూడెం, పిట్టంపల్లి, పేరేపల్లి, బొంగోనిచెర్వు, చిన్నకాపర్తి గ్రామాల్లో వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, మాజీ సర్పంచ్‌లు అంతటి వెంకటేష్‌గౌడ్, సామిడి మోహన్ రెడ్డి, దేశబోయిన మల్లమ్మ పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

నల్లగొండ టూటౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం నల్లగొండలో బీజేవైఎం ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ చేశారు. అనంతరం గడియారం వద్ద బైఠాయించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం భూములను, పర్యావరణాన్ని, మూగజీవాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసినందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించి వెంటనే విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ భూమి వేలం వేసే ప్రక్రియను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్యయుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పిన్నింటి నరేందర్, దిందు భాస్కర్ గౌడ్, దుబ్బాక సాయి కిరణ్, గుండెబోయిన శాంతి స్వరూప్, మిర్యాల వెంకన్న, కొత్త లింగస్వామి, భరత్, సాయి కుమార్, వట్టికోటి దుర్గా, కర్నాటి శివ, పాశం శ్రీనివాస్ రెడ్డి, పక్కీరు మోహన్ రెడ్డి, కాశమ్మ, నవీన్ రెడ్డి, బైరు సత్తయ్య, గోపి, జగ్జీవన్, వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కటకం శ్రీధర్, గోగులోతు తార పాల్గొన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



నల్లగొండ టౌన్ : కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



నకిరేకల్ : నివాళులర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు సాధించేందుకు కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. కొమురయ్య జయంతి సందర్భంగా గురువారం సీపీఐ కార్యాలయంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్, విశ్వనాథుల లెనిన్, కోటేష్ సుజాత, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : యాదవ సంఘం ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలో దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. మెయిన్ సెంటర్‌లో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు ఏశబోయిన పాండు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుండెబోయిన యాదగిరి, ఆరాల వెంకన్న, కదిరె సైదులు, ఏర్పుల కృష్ణ, యశ్వంత్, కదిరె రమేష్, కంబాల సోమయ్య, కొండ అంజమ్మ, మల్లేష్, జనార్దన్, కొమ్ము కోటేష్, శివ, సాయన్న, బొల్లం తేజ, పిండి సాయి, శంకర్, నవీన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

నల్లగొండ టౌన్: పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు 80 గజాల చొప్పున ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుట్టను కబ్జా చేస్తున్నవారిపైన అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో నివాసం ఉంటున్న పేదలందరికీ అన్నేశ్వరమ్మ గుట్ట ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, విశ్వనాథుల లెనిన్, కేఎస్ రెడ్డి, వీరయ్య, కోటేష్, సుజాత, చింత ధనలక్ష్మి, పులిగిల్ల లక్ష్మి కౌశల్య, సైదమ్మ, అండాలు, పద్మ, హైమావతి, మాధవి, విజయకుమారి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న రాందాస్ శ్రీనివాస్

మర్రిగూడ : ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ గురువారం పంపిణీ చేశారు. అజ్జిలాపురం గ్రామానికి చెందిన నేనావత్ వెంకటేష్‌కు రూ.60వేలు, తమ్మడపల్లి గ్రామానికి చెందిన సేగోజు ఈశ్వరాచారికి రూ.60వేలు, ఖుదాబాక్షపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములుకు మంజూరైన రూ.60వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్క శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ మేతరి యాదయ్య, జమ్ముల వెంకటేష్, ఊరిపక్క జంగయ్య, దండేటక్కర్ అంజయ్య, కొట్టం రమేష్, ఎలిమినేటి సత్తిరెడ్డి, కొట్టం శ్రీనివాస్, రామిడి వెంకట్‌రెడ్డి, మల్లయ్య, చిన్న మల్లయ్య, సత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంలో అక్రమ నిర్మాణం !

నాంపల్లి : మండలంలోని చిట్టంపహాడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ గురువారం నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పాఠశాల తరగతి గదుల పక్కనే పశువుల పాక వేయడంతో దుర్వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు ఎస్ఐ శోభన్‌బాబు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. ఈ విషయమై ఎంఈఓ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థలంలో అక్రమ నిర్మాణాల కోసం కొందరు మెటీరియల్ పోశారని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై ప్రధానోపాధ్యాయురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. దర్యాప్తు అనంతరం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.



చిట్టంపహాడ్ ప్రాథమిక పాఠశాల స్థలంలో పోసిన మెటీరియల్

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ : గోరెంకలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కనగల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్ : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి, చందుపట్ల, తాటికల్, కడపర్తి, నెల్లిబండ, టేకులగూడెం, ఓగోడు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఆయా కార్యక్రమాల్లో నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ జమురుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ జానిమియా, సీఈఓ జగన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నకిరేకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గోరెంకలపల్లి, నోములు, తాటికల్, చందుపట్ల, కడపర్తి గ్రామాల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కేతేపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, చెర్కుపల్లి, తుంగతుర్తి, కొప్పోలు భీమారం, చీకటిగూడెం, కొత్తపేట, కొర్లపహాడ్, కాసనగోడు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ గుత్త మంజులమాధవరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మందడి వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఏఓ బి.పురుషోత్తం, పీఏసీఎస్ సీఈఓ వి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తిప్పర్తి : మండలంలోని ఆరెగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, డీసీఓ పాత్యా నాయక్, నాయకులు ఉట్కూరి సందీప్‌రెడ్డి, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, కొండల్, వనపర్తి శ్రీరాములు, అంబేద్కర్, కిన్నెర అంజి పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

కనగల్ : రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల్లోనే విక్రయించాలని డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పర్వతగిరి, కనగల్, దోరెపల్లి, పగిడిమర్రి, శాబ్దుల్లాపురం, పొనుగోడు, రాంచంద్రపురం, కురంపల్లి, బచ్చన్నగూడెం, మదనపురం, బుడుమర్లపల్లి, అమ్మగూడెం, ఎం గౌరారం, తుర్కపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లారీలు, గన్నీ సంచుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునితాకృష్ణయ్యగౌడ్, ఏఓ అమరేందర్‌గౌడ్, ఏపీఎం సంకు హరి, కిసాన్ సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి మాజీ కో ఆప్షన్ సభ్యుడు హఫీజ్, నర్సింగ్ మురళీధర్‌గౌడ్, ఏమిరెడ్డి దిలీప్‌రెడ్డి సీసీలు విజయలక్ష్మీ, వసంత, ప్రభాకర్, జానకి ఐకేపీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి




నల్లగొండ: జాబ్‌మేళాపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నల్లగొండ: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఈ నెల 5వ తేదీన నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని నల్లగొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని లూయిస్ నగర్ కాలనీలో గురువారం జాబ్ మేళాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శంకర్, సందీప్, వన్ టౌన్ పోలీస్ సిబ్బంది, కాలనీ పెద్దలు కిరణ్, శ్రీను పాల్గొన్నారు.

తిప్పర్తి : జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ కోరారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో యువకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొత్తం 100 కంపెనీలు 2500 వరకు ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు.

కట్టంగూర్ : జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించే యువతేజం మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. గురువారం కట్టంగూర్‌లో నిరుద్యోగ యువతతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలోని నిరుద్యోగ యువత స్థానిక పోలీసు స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారిని ఈ నెల 5న నల్లగొండకు తీసుకెళ్లనున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అఫ్జల్, సిబ్బంది మునాస సత్యనారాయణ, బండారు సతీష్, శంకర్, సిరికొండ శ్రీను ఉన్నారు.

రోడ్లపైనే ధాన్యం రాశులు



కనగల్ మండల పరిధిలోని అమ్మగూడెం నుంచి ఎం.గౌరారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై రైతులు ధాన్యం రాశులు పోయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నాయి. రోడ్లపై ధాన్యం రాశులతో రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది - కనగల్

ధాన్యం ఆరబెట్టుకుని తీసుకురావాలి

నాంపల్లి : రైతులు ధాన్యం ఆరబెట్టుకుని, తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సహకార సంఘం చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో డైరెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివకుమార్, వైస్ చైర్మన్ దండిగా సత్తయ్య, సీఈఓ నితీష్, డైరెక్టర్లు, సత్తయ్య, ఎరెడ్ల వెంకట్ రెడ్డి, తౌర్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్ట్

చిట్యాల: హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు 'చలో సెక్రటేరియేట్'కు వెళ్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులను గురువారం చిట్యాల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయినవారిలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, పంది నరేష్, గోలి సాయికిరణ్ తదితరులున్నారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీ కత్తుపై విడుదల చేశారు.

చండూరు : హెచ్‌సీయూ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను గురువారం బంగారిగడ్డలో అరెస్టు చేసి చండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మాదగోని అరుణ్, హరి, రాజు, చింటు, రాజు తదితరులు ఉన్నారు.

మర్రిగూడ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయొద్దని డిమాండ్ చేస్తూ గురువారం సచివాలయ ముట్టడికి వెళ్తున్న మర్రిగూడ మండల ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఏబీవీపీ మండల నగర కార్యదర్శి పానగంటి సందీప్, ధర్మ, అధ్యక్షుడు, అంజి, అభిలాష్, రోహిత్, చందన్, రాము ఉన్నారు.

14 వరకు రాజీవ్ యువ వికాసం గడువు పెంపు

గట్టుప్పల్ : రాజీవ్ యువ వికాసం పథకానికి ఈ నెల 14 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని గట్టుప్పల్ ఎంపీడీఓ మాధవరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న పత్రాలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోనివారు నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తే ఆన్‌లైన్ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీబీ నిర్ధారణ యంత్రం ప్రారంభం

మర్రిగూడ : ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చండూరు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన టీబీ నిర్ధారణ యంత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శంకర్‌నాయక్, వైద్యులు దీపక్, శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.